



డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలి

- కర్నూలులో హైకోర్టు కోసం దేనికైనా సిద్ధం - రాయలసీమ గర్జనలో మంత్రులు, వక్తలు



రాయలసీమ గర్జనలో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కర్నూలు క్రైం

శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేమాలని, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని మంత్రులు, పలువురు వక్తలు డిమాండ్ చేశారు. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని కోరుతూ కర్నూలు ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో కర్నూలు మేయర్ బివై.రామయ్య అధ్యక్షతన సోమవారం రాయలసీమ గర్జనను నిర్వహించారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాషా మాట్లాడుతూ... 1937 నుంచి మరుగున పడిన శ్రీబాగ్ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చి అన్ని ప్రాంతాలకూ న్యాయం చేయాలని జగన్ ముందుకు వెళ్తుంటే టిడిపి నాయకులు ఒకే రాజధాని అంటున్నారని తెలిపారు. ఉద్యమం ఆరంభమైందని, జెఎసికి వైసిపిగా మద్దతునిస్తున్నామని, న్యాయరాజధాని సాధించుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. టిడిపి నాయకులు ఇళ్ల వద్దకు వస్తే మహిళలు చీపురు, పురుషులు చెప్పులు పట్టుకుని తరమికొట్టాలన్నారు. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు పెట్టడాన్ని టిడిపి నాయకులు ఎందుకు అడ్డుకుంటున్నారన్నారు. చంద్రబాబుకు కర్నూలులో హైకోర్టు పెట్టడం ఇష్టం ఉందా? లేదా? అని ప్రశ్నించారు. అన్ని ప్రాంతాలకు న్యాయం చేయాలనే వికేంద్రీకరణ సిద్ధాంతాన్ని తీసుకొచ్చారన్నారు. చంద్రబాబును రాయలసీమ దోషిగా పరిగణించాలన్నారు. చంద్రబాబు, టిడిపికి రియల్ ఎస్టేట్ బృందం మీద తప్ప ఎవరి మీదా ప్రేమ లేదన్నారు. అందరి అభిప్రాయాల మేరకే కర్నూలులో హైకోర్టు పెట్టాలని సిఎం అనుకున్నారని, 10 కిలోమీటర్ల మేర కనపడేలా హైకోర్టు కట్టబోతున్నామని తెలిపారు. చంద్రబాబు రాయలసీమలో పుట్టింటే హైకోర్టు ఏర్పాటుకు మద్దతిస్తారన్నారు. కర్నూలు పేరుతో వేల కోట్లు సంపాదిస్తున్న చిత్రపరిశ్రమకు చెందినవారు కర్నూలులో హైకోర్టును డిమాండ్ చేయాలన్నారు. శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎంపిలు సంజీవ్ కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ రాజధాని అడిగే హక్కు రాయలసీమకే ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా రాజధాని ఒక చోట, హైకోర్టు మరో చోట ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కోరుముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ హక్కులు సాధించుకునే వరకూ పోరాటం సాగించాలని, బలిదానానికి కూడా సిద్ధంగా ఉండాలని అన్నారు. పోరాడితే హక్కులు కాపాడుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఆరంభ సూరత్వం కాకుండా ఏమైనా చేయడానికి కూడా సిద్ధంగా ఉండాలని చెప్పారు. జెఎసి ఛైర్మన్ విజయ్ కుమార్ రెడ్డి, విద్యార్థి జెఎసి అధ్యక్షులు సునీల్ రెడ్డి, ఛైర్మన్ శ్రీరాములు, ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెంగళరెడ్డి, హైకోర్టు న్యాయవాది పల్లి ప్రభాకర్ రెడ్డి, న్యాయవాది నాగలక్ష్మి, రవీంద్ర విద్యా సంస్థల అధినేత పుల్లయ్య, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు ఓంకార్, రవిగువేర, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు జయచంద్రారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఆర్ కృష్ణ, మైపర్ విద్యా సంస్థల అధినేత ఆదిమూలపు సతీష్, జెఎసి రీజినల్ కోఆర్డినేటర్ ఆకెపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ప్రయివేటు కళాశాలల జెఎసి నాయకులు లింగేశ్వరరెడ్డి మాట్లాడారు.

మంత్రులు మాట్లాడక ముందే వెనుదిరిగారు

రాయలసీమ గర్జన సభకు ప్రయివేటు కళాశాలల విద్యార్థులను పెద్ద ఎత్తున తరలించారు. ఎండ మండిపోవడంతో విద్యార్థులు చాలా సేపు కూర్చోలేకపోయారు. ఇంకెంత సేపు అంటూ విసిగిపోయారు. మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడటం ప్రారంభించిన వెంటనే విద్యార్థినులు లేచి వెళ్లిపోయారు. దీంతో ముందు భాగంలోనే కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కొంద మంది విద్యార్థులను మళ్లీ వెనక్కి పంపి కూర్చోబెట్టగా వారు కూడా కాసేపటి తరువాత మెల్లగా జారుకున్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు...సామాన్యులకు ఇబ్బందులు

రాయలసీమ గర్జన నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్రీరామ థియేటర్, మౌర్యా ఇన్, రాజ్ విహార్, ఐదు రోడ్ల కూడలి ప్రాంతాలవైపు ఎటువంటి వాహనాలనూ పోలీసులు అనుమతించలేదు. అత్యవసరంగా వెళ్లాల్సిన వారి పట్ల కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. మౌర్యా ఇన్ కూడలి వద్ద ఓ ద్విచక్రవాహనదారుడు ఆస్పత్రికి వెళ్లాలని విన్నవించినా ట్రాఫిక్ ఎస్ఐ కరుణించకుండా లేదు..తిరిగి వెళ్లండి అంటూ సమాధానం ఇచ్చారు. బ్యాంకుకు వెళ్లాలని చెప్పిన ఓ బ్యాంకు ఉద్యోగికి వాహనం ఎక్కడో ఒక చోట పెట్టుకుని పోవయ్యా అంటూ ఉచిత సలహా ఇచ్చారు.



బహిరంగ సభకు హాజరయిన జనం

నేడు ఎఐకెఎస్ బహిరంగ సభ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆలిండియా కిసాన్ సభ మహాసభలు కేరళలోని త్రిసూర్‌లో ఈ నెల 13 నుంచి 16 వరకూ జరగనున్న నేపథ్యంలో అమరవీరుల జ్యోతుల జాతా కర్నూలుకు చేరుకోనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం కర్నూలు సి.క్యాంప్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు వెంకటేశులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ సభలో ఎఐకెఎస్ అఖిల భారత నాయకులు క్రిష్ణ ప్రసాద్, సాగర్, ఎపి రైతు సంఘం కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడతారని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో మొట్టమొదట అమరుడైన దొడ్డి కొమరయ్య పేరుతో తెలంగాణ నుంచి బయలుదేరిన అమరవీరుల జ్యోతుల జాతా గుంటూరు, వినుకొండ, దోర్నాల, ఆత్మకూరు మీదుగా కర్నూలుకు చేరుకుంటుందని తెలిపారు. ఈ మహాసభలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అక్రమ సర్దుబాటును నిలిపేయాలి

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ - డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఉపాధ్యాయుల అక్రమ సర్దుబాటు ప్రక్రియను నిలిపేయాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి డిఇఒ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.జయరాజు మాట్లాడారు. ఇటీవలి కాలంలో విద్యాశాఖలో సర్దుబాటు పేరుతో అనేకమంది ఉపాధ్యాయులను అక్రమంగా బదిలీ చేశారని తెలిపారు. వాస్తవానికి ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ షెడ్యూల్‌ను విడుదల చేయాలని పలుమార్లు విద్యాశాఖ మంత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు ఏకంగా అక్రమ బదిలీల పేరుతో సర్దుబాటు ప్రక్రియకు తెరలేపారని తెలిపారు. కొంతమంది అధికార పార్టీకి చెందిన నేతలు, విద్యాశాఖ అధికారులు కుమ్మక్కై ఉపాధ్యాయుల అక్రమ సర్దుబాటుకు ఆదేశాలు జారీ చేస్తున్నారని చెప్పారు. వెంటనే రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ప్రక్రియను నిలిపేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ కూడా విడుదల చేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు యుఆర్ఎ.రవికుమార్, ఆర్థిక కార్యదర్శి జి.హేమంత్ కుమార్, జిల్లా నాయకులు నవీన్ పాటి, మద్దిలేటి, తిమ్మన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

రూ.3364 కోట్లతో గురుకులాల అభివృద్ధి

- మంత్రి మేరుగు నాగార్జున

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎస్‌సి గురుకుల పాఠశాలలు, హాస్టళ్లు నాడు-నేడు కింద రూ.3364 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. కర్నూలు పర్యటనలో భాగంగా సోమవారం దిన్నెదేవర పాడులోని ఎస్‌సి బాలికల గురుకుల పాఠశాలను మంత్రి నాగార్జున ఆకస్మిక తనిఖీ చేసారు. గురుకులంలోని అన్ని విభాగాలను పరిశీలించడంతో పాటుగా విద్యార్థినిలు, సిబ్బందితో కూడా మాట్లాడి అక్కడ ఉన్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ, సాంఘిక సంక్షేమశాఖకు చెందిన గురుకులాలు, హాస్టళ్ల భవనాలను కూడా నాడు-నేడు పథకంలో చేర్చారని తెలిపారు. నాడు-నేడు తొలి దశలో భాగంగా 673 ఎస్‌సి హాస్టళ్లు, గురుకులాల్లో మరమ్మతులు చేపట్టి మెరుగులు దిద్దనున్నట్లు వెల్లడించారు. ఈ పథకం అమలుతో ఎస్‌సి హాస్టళ్లు, గురుకులాల రూపురేఖలు మారనున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎస్‌సి గురుకులాలకు చెందిన విద్యార్థులు పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో మంచి ఫలితాలనే సాధిస్తున్నారని చెప్పారు. తక్కువ ఫలితాలు రావడానికి కారణమైన టీచర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. మంచి ఫలితాలను సాధించిన సబ్జెక్ట్ టీచర్లకు ప్రోత్సాహక బహుమతులు కూడా ఇస్తామని మంత్రి నాగార్జున వెల్లడించారు.



హాజరు పట్టికను పరిశీలిస్తున్న మంత్రి నాగార్జున

గ్రామాల్లో ఉపాధి పనులు పెట్టాలి

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు పెట్టాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. గృహ నిర్మాణ పనుల్లో పురోగతి లేని ఎఇలపై చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నుంచి మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నాడు-నేడుకు సంబంధించి ఎక్స్‌పెండిచర్ బుకింగ్ చేయని పాఠశాలను బుకింగ్ చేయాలన్నారు. పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరు ముద్ద కార్యక్రమాన్ని పర్యవేక్షించి నివేదికలను తెప్పించుకోవాలని డిఇఒను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా పనులకు సంబంధించి పూర్తయిన పనులకు సంబంధించి ఆన్‌లైన్‌లో బడ్జెట్ వివరాలను నమోదుపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. చెత్త తయారీ కేంద్రాల నిర్మాణానికి సంబంధించి ఎంపిడిఒలతో పురోగతి పై ఆరా తీశారు. స్థల సమస్య లేని చోట ఎన్ఆర్ఇజిఎస్ లేబర్ ద్వారా పనులు ప్రారంభించి మస్ట్ వేసి ఎఫ్‌పిఒ జెనరేట్ చేయాలన్నారు. క్లాప్ మిత్రాలకు సంబంధించి ఇంకా చెల్లించని పంచాయతీల్లో ఎంపిడిఒ ఇఒపిఆర్‌డిలను గురువారం నాటికి చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని డిపిఒను ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులకు సంబంధించినవి కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతన్న ఇక్బాల్ హుస్సేన్

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వాలు తోడ్పాటునివ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రేద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం, ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం, ప్రత్యేకమైన సంక్షేమ పథకాలను, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా, ఆర్థిక తోడ్పాటును అందించాలని ఆవాజ్ నగర కార్యదర్శి పి.ఇక్బాల్ హుస్సేన్ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు నగరంలోని ఖడక్‌పుర ప్రాంతం వాసుల, ఆవాజ్ కమిటీ సర్వసభ్య సమావేశం, సలీంబాష అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా పి.ఇక్బాల్ హుస్సేన్, మొహమ్మద్ షరీఫ్ మాట్లాడారు. ముస్లిం, దళిత మైనార్టీల స్కాలర్షిప్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసినా బిజెపి వైఖరిని అధికారపక్షం వైసిపి , ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు పల్లెత్తు మాట కూడా మైనార్టీల పక్షాన మాట్లాడలేదన్నారు. అధికార ప్రతిపక్ష పార్టీలన్నిటికీ ముస్లిం మైనార్టీల ఓట్లు కావాలి తప్ప వారి అభివద్ధి అవసరం లేదన్నారు. రాయలసీమ గర్జన పేరుతో, రాయలసీమ న్యాయ రాజధాని, వికేంద్రీకరణ, అభివృద్ధి అంటూ ఊకదంపుడు మాటలతో, ప్రజాధనాన్ని, దుర్వినియోగం చేస్తుందని వైసిపి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రత్యేక హోదాను మర్చిపోయిన వైసిపి విభజన హామీల ఊసేలేని వైసిపి గర్జన దేనికోసమని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర అభివద్ధి కోసం అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొని ఢిల్లీ గద్దెను గడగడలాడించాలని వైసిపి ప్రభుత్వానికి కోరారు. సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ మాట్లాడారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఇలియాజ్ అధ్యక్షుడిగా, సలీం బాషా కార్యదర్శిగా మరో ఇద్దరు వైస్ ప్రెసిడెంట్లుగా బాష, గౌస్‌బాష ఇంకొక ఇద్దరు సహాయ కార్యదర్శులను అంజాద్, జాకీర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నగర నాయకులు ఇలియాస్, గనిఖాన్, హుస్సేన్, జుబేర్ పాల్గొన్నారు.

పోలకల్‌లో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోనీ పోలకల్‌లో ఎఒ మల్లేష్ కుమార్ సిబ్బందితో వెళ్లి రైతు మల్లేష్ పొలంలో పంట ప్రయోగం చేపట్టారు. ఇందులో కొలమానం ప్రకారం 5 కేజీల 750 గ్రాములు వచ్చాయని ఎకరా ప్రకారం 18 క్వింటాళ్లు వస్తుందని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ ఆదినారాయణ, సిబ్బంది వెంకటేశ్వర్లు, ఇన్సూరెన్స్ ఏజెంట్ ముస్తక్ ,విఆర్‌ఒలు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని డిఇఒ వెంకట్ రంగారెడ్డి ఆ సంఘం నేతలకు హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సామూహిక రాయబార కార్యక్రమంలో భాగంగా డిఇఒకు యూనియన్ నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. యూనియన్ సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు జె.నాగేశ్వరరావు, సంఘం జిల్లా అధ్యక్షురాలు కె. భారతి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ గతంలో ప్రతి విద్యార్థికి 90 పైసలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా పది పైసలు ఉండేదన్నారు. ప్రస్తుతం కేంద్రం వాటా 60 పైసలు రాష్ట్రం వాటా 40 పైసలు ఉన్నందు వల్ల సకాలంలో బిల్లులు రావటం లేదన్నారు. కొత్త మెనూ ప్రకారంగా ఇప్పుడు ఇస్తున్న మెనూ ఛార్జీలు సరిపోవని వాటిని రూ.20 పెంచాలని ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేయాలన్నారు. వేతనాలు రూ.6వేలు ఇవ్వాలని , గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కొన్ని పాఠశాలలకు డీలర్లు బియ్యం సరాపర చేయకుండా ఏజెన్సీలకు ఆటంక పరుస్తున్నారని, డీలర్లు బియ్యం సరపరా చేసిన ఏజెన్సీ వద్ద డబ్బులు అడుగుతున్నారన్నారని సంఘం నాయకులు డిఇఒ దృష్టికి తెచ్చారు. డిఇఒ స్పందిస్తూ నిర్దిష్టంగా అటువంటి డీలర్ల పై చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. తనిఖీల పేరుతో అధికారులు ఏజెన్సీలను వేధిస్తున్నా రన్నారు. స్థానికంగా విద్యార్థుల రుచికి అనుగుణంగా మెనూలో మార్పు చేయాలనికోరారు. సంఘం జిల్లా నాయకులు శ్రీ వాణి, లక్ష్మీదేవి, ప్రమీల, రాణి, గణేష్, పద్మ , కొత్తపేట పద్మ , అత్తర్ ఉన్నిసా, రజియా ఇస్తేరమ్మ, రమీ జాబి, జహ్రాబి, తాండ్రపాడు లీలావతి సరోజమ్మ ప్రభుదాసు శ్రీరాములు జయలక్ష్మి పాల్గొన్నారు.



డిఇఒకు వినతిపత్రం అందజేసి వివరిస్తున్న నాయకులు

ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టకండి

ఒబిసి మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

రాయలసీమ గర్జన రాష్ట్ర ప్రభుత్వం ప్రాయోజిత కార్యక్రమమని, వైసిపి గర్జన పేరుతో రాయలసీమపై మరోసారి మోసానికి తెగబడుతోందని ఒబిసి మోర్చా జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి ఆరోపించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి రాయలసీమను " అభివృద్ధి చేయలేక - ఇచ్చిన హామీలను నెరవేర్చలేక 'రాయలసీమ గర్జన' పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేలా కొత్త నాటకానికి తెర లేపడం సిగ్గుచేటన్నారు. అన్యాయానికి గురైన వాళ్ళు నిరసన తెలుపుతూ సభలు పెడతారని, నేడు " రాయలసీమకు అన్యాయం చేసినవాళ్లే సభలు పెట్టి నిరసన తెలపడం విడ్డురంగా ఉందని ఎద్దేవా చేశారు. కర్నూల్లో హైకోర్టు ఏర్పాటుకు బిజెపి మద్దతు తెలిపిందని, వైసిపి కర్నూలు లో హైకోర్టు ఏర్పాటు చేస్తామని ప్రజలకు చెబుతూ మోసం చేస్తోందన్నారు. చిత్తశుద్ధి ఉంటే - హైకోర్టు కర్నూలులో పెడతామని ఇంతవరకు , కేంద్రానికి లేదా సుప్రీంకోర్టుకు, కేంద్ర మంత్రిత్వ శాఖకుకు గత 3 సంవత్సరాలలో ఎందుకు ప్రతిపాదనలు పంపలేదన్నారు.కర్నూలులో ఏర్పాటు కావలసిన జ్యుడీషియల్ అకాడమీని మంగళగిరికి ఎందుకు తరలించారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కర్నూలు లో ఏర్పాటు కావలసిన కృష్ణా రివర్ బోర్డుని విశాఖకు ఎందుకు తరలించారో సమాధానం చెప్పాలన్నారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముందుగా రాయలసీమ ప్రజలకు క్షమాపణ చెప్పి, యుద్ధ ప్రతిపాదికన రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయలన్నారు.

వైసిపి రాయలసీమ గర్జన అట్టర్‌ప్లాప్: టిడిపి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో వైసిపి నిర్వహించిన రాయలసీమ గర్జన అట్టర్ ప్లాప్ అయిందని టిడిపి కర్నూలు, నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరు వెంకట్ రెడ్డి ఎద్దేవా చేశారు. సోమ వారం కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యా లయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నెలలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు కర్నూలు జిల్లా పర్యటనలో దాదాపు 5 లక్షల మంది పాల్గొని కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేశారన్నారు. రాత్రి వేళల్లో కూడా బాబు రాకకోసం ఎదురుచూసి వారికి పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారన్నారు. ఇది తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన పార్టీ వారిని రెచ్చగొట్టి డమ్మీ జెఎసి పేరుతో కొంతమంది వైసిపి లాయర్లను ఉసిగొలిపి విద్యార్థి జెఎసి అంటూ చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడానికి ప్రయత్నించి గోరంగా దెబ్బతిన్నారన్నారు. ఇది జీర్ణించుకోలేక జిల్లాలో చంద్రబాబు పర్యటనను తలదన్నేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని, వైసిపి నాయకులను ఆదేశిస్తే, రాయలసీమ గర్జన పేరుతో 3 జిల్లాల నుంచి జనసమీకరణ చేయగా, చంద్రబాబు పర్యటనకు వచ్చిన ప్రజలలో కనీసం 10వ వంతు కూడా వైసిపి గర్జనకు హాజరుకాలేదన్నారు. రాయలసీమ ప్రజలపై ముఖ్యమంత్రికి ప్రేమ ఉంటే రాయలసీమ ప్రాంతం నుండి పరిశ్రమలు తరలిపోతుంటే ఎందుకు నివారించలేదని ప్రశ్నించారు. ఇక్కడ సభ నిర్వహించే బదులు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వచ్చి 150 మంది ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపిలు ఢిల్లీకి తీసుకొని వెళ్లి ప్రధాని ఇంటి ముందు నిరసన తెలపాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుత్ను సోమిశెట్టి, గౌరు వెంకట్‌రెడ్డి

ట్రిపుల్ ఐటి డిఎం డైరెక్టర్‌కు లైఫ్ టైం అవార్డు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ట్రిపుల్ ఐటిడిఎం డైరెక్టర్ సోమయాజులకు సోమవారం హైదరాబాదులో ఎక్సలెంట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ విభాగం కింద లైఫ్ టైం అవార్డు స్వీకరించారు. బ్రెయిన్ ఓ విజన్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెంట్ అవార్డుల కింద డైరెక్టర్ సోమయాజులు పరిశోధనాత్మక విద్య కేటగిరిలో ఆయన అవార్డు అందుకున్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ మంత్రిత్వ శాఖ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సోమయాజులు కు అవార్డు రావడం పట్ల ట్రిపుల్ ఐటిడిఎం అధ్యాపక బృందం , విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకోబోన్న సోమయాజులు



విద్యార్థులను అభినందిస్తున్న అఖ్తర్‌భాను

సేవ్‌హంద్రీ ప్రాజెక్టు విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

అంతర్జాతీయ స్వచ్ఛంద సేవదినోత్సవంలో భాగంగా సిల్వర్ జూబ్లీ ప్రభుత్వడిగ్రీ కళాశాలలో హంద్రీ నది దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా సేవ్ హంద్రీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులను అభినందించారు. కళాశాల బిఎస్‌సి మొదటి సంవత్సరం విద్యార్థులయిన బి.అనిల్ కుమార్, బి. నిఖిల్, బి. అజయ్ కుమార్ , సి. రవి కుమార్ లు సమర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు డాక్టర్ వివిఎస్.కుమార్ అభినందించారు. తుంగభద్ర , హంద్రీ నదుల నడుమ వెలసిన విశిష్ట నాగరికత కర్నూలు నగరానికి ఉందని, ఈ నగర చరిత్ర, సంస్కృతి , వారసత్వ సంపదను కాపాడుకోవాలని యువతకు సందేశమిచ్చారు. డిగ్రీ విద్యార్థులు పర్యావరణానికి సంభందించిన అంశంపై పరిశోధన చేసినందుకు విద్యార్థులను , పరిశోధన పర్యవేక్షకురాలు డాక్టర్ అఖ్తర్‌భానుల కృషిని ప్రశంసించారు. అనంతరం కళాశాల మహిళ సాధికారత విభాగం సమన్వయకర్త డాక్టర్ అఖ్తర్‌భాను మాట్లాడుతూ మిలియన్ సిటీగా ఎదుగుతున్న కర్నూలు నగరంలో నదుల దురాక్రమణ ఆందోళనకరంగా మారినదని పేర్కొన్నారు. కబ్జాలతో పర్యావరణానికి ముప్పు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేసారు. ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా మండలి రూపకల్పన చేసిన ఈ సామాజిక సేవా ప్రాజెక్టును పూర్తి అయ్యేలా సహకరించిన కర్నూలు మున్సిపాలిటి కార్పొరేషన్ అధికారులకు, సచివాలయ ఉద్యోగులకు , పరిశోధనకు సహకార మందించిన మానవశక్తి పరిశోధనా కేంద్ర వ్యవస్థాపకులకు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

ప్రాణాలు పోతున్నా స్పందించరా..?

- విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం వీడాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు

ప్రజల ప్రాణాలు పోతున్నా స్పందించరా అంటూ, విద్యుత్ శాఖాధికారులు నిర్లక్ష్యం వీడాలంటూ సిపిఎం నాయకులు మండిపడ్డారు. సోమవారం మండలంలోని పెద్దతుంబలం గ్రామ సచివాలయం ముందు సుమారు 2 గంటల పాటు ప్రజలు, నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న, నాయకులు కృష్ణమూర్తి, దానప్ప, మాజీ ఎంపిటిసి సలీమ్ మాట్లాడారు. మండలంలోని పెద్దతుంబలం 7వ వార్డులోని సుమారు 100 ఇళ్ల మిద్దెలపై 11కెవి విద్యుత్ తీగలు వెళ్తాయని తెలిపారు. ఇప్పటికే ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఐదుగురు గాయాలతో బయట పడ్డారని చెప్పారు. విద్యుత్ శాఖాధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తీగలు తొలగించాలని అడిగితే 'డబ్బులు కట్టండంటూ' ప్రజలను తిరిగి ప్రశ్నిస్తున్నారని అన్నారు. ప్రమాదకరమైన ఈ తీగలను ప్రభుత్వం తొలగించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. విద్యుత్ అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదిలేది లేదని భైఠాయించారు. అనంతరం ఎఇ చెన్నయ్య వచ్చి వినతిపత్రం స్వీకరించారు. అనంతరం ఆ వార్డులో విద్యుత్ తీగల వల్ల జరిగే ప్రమాదాన్ని పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ధర్నాను విరమించారు. వార్డు ప్రజలు ఈరన్న, బలరామ్, సుభాన్ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

- సిపిఎం జిల్లా నాయకులు ఈరన్న

ప్రజాశక్తి - పెద్దకడుబూరు



పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

మండలంలోని వివిధ గ్రామాల్లో రహదారులకు మరమ్మతులు చేపట్టాలని సిపిఎం జిల్లా నాయకులు ఈరన్న డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో పెద్దకడుబూరు నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రను ఈరన్న జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామానికి తారు రోడ్డు, గ్రామాల్లో పలుచోట్ల సిసి రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. పెద్దకడుబూరు నుంచి బిల్లేకల్లు వరకు, పెద్దకడుబూరు నుంచి ముచ్చిగిరి, అలాగే కల్లుకుంట, ఎమ్మిగనూరు వరకు తారు రోడ్డు వేయాలని తెలిపారు. ఇప్పుడున్న రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, వాటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాధికారులు వెంటనే స్పందించి రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి ఈడిగ తిక్కన, సిపిఎం సీనియర్ నాయకులు పరమేష్ ఆచారి, సిఐటియు డివిజన్ అధ్యక్షులు తిప్పన్న, సిఐటియు మండల కార్యదర్శి ఉప్పర రంగన్న, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి దేవదాసు, వ్యకాస మండల కార్యదర్శి ఉప్పర శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు తిక్క స్వామి, మండల నాయకులు చిరంజీవి, డివైఎఫ్ఐ మండల నాయకులు ఆదాం, భవన నిర్మాణ కార్మికులు ఉప్పర వీరేష్, చాకలి గణేష్, రైతు సంఘం మండల నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

మురుగునీటిని రోడ్లపై వదిలే వారికి నోటీసులు

ప్రజాశక్తి - చిప్పగిరి



హెచ్చరికలు జారీ చేస్తున్న అధికారులు

గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మురుగు నీటిని రోడ్లపై వదిలితే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి బాలన్న హెచ్చరించారు. సోమవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో రోడ్లపై మురుగునీటిని వదిలే వారికి సచివాలయ సిబ్బందితో కలిసి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిశుభ్రత కోసం ప్రజలు రోగాల బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పంచాయతీ యాక్ట్ ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారం రోజుల క్రితం మొదటి నోటీసును జారీ చేసినట్లు తెలిపారు. వారిలో మార్పు రాక యథావిధిగా రోడ్లపై మురుగునీటిని వదలడంతో దుర్వాసన కొడుతూ గ్రామస్తులకు, రాకపోకలకు ఇబ్బందిగా మారిందని చెప్పారు. నేమకల్లు గ్రామంలోని సంగాల రోడ్డులో ఉన్న ఇళ్లకు, ఎస్సీ, బీసీ కాలనీ వాసులకు 32 మందికి రెండో నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటికీ మార్పు రాకపోతే మూడో నోటీసు జారీ చేసి పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికైనా సహకరించి రోడ్లపై మురుగునీరు వదలకుండా ఎవరి ఇంటి ముందు వారు ఇంకుడు గుంతలు తీసుకోవాలని కోరారు.

ఎవరికి వారే.. యమునా తీరే..!

- ఆదోని టిడిపిలో మరోసారి బయటపడ్డ వర్గ విభేదాలు

- వేర్వేరుగా 'ఇదేం..ఖర్మ' నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో వైసిపి వైఫల్యాలను ఎండగడుతూ టిడిపి 'ఇదేం..ఖర్మ...మన రాష్ట్రానికి' పేరుతో కార్యక్రమం నిర్వహిస్తోంది. ఆదోనిలోని టిడిపి నాయకులు ఉన్న విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కార్యక్రమాన్ని వేర్వేరుగా నిర్వహిస్తుండడంతో కార్యకర్తలు నిరుత్సాహ పడుతున్నారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, అనుకూలంగా మలుచుకుని వచ్చే ఎన్నికల్లో అధికారమే పరమావధిగా టిడిపి ముందుకు వెళ్తోంది. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటన చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఉత్సాహ పరుస్తున్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. నవంబరు 16న ఆదోనిలో నిర్వహించిన రోడ్ షోకు అశేష జనవాహిని వచ్చారని, కార్యకర్తల్లో నూతనోత్సాహం వచ్చిందని అధినేత చంద్రబాబు పలు కార్యక్రమాల్లో ఉచ్చరించారు. కార్యక్రమం విజయవంతం కావడంతో కార్యకర్తల్లో జోష్ పెరిగింది. నాయకులు మాత్రం బేజారుపడుతూ ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం'కు దీటుగా 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'ని టిడిపి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. పార్టీ కార్యక్రమాలు సమిష్టిగా నిర్వహించాల్సిన నాయకులు వేర్వేరుగా చేపడుతూ, కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తున్నారు. నాయకులందరినీ ఒకే తాటిపైకి తేవాల్సిన అధిష్టానం చోద్యం చూస్తోందని, దీనివల్ల పార్టీకి నష్టం జరిగే అవకాశం లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు.

ముదిరిన విభేదాలు : గతనెల 16న అధినేత చంద్రబాబు రాకతోనైనా నియోజకవర్గంలోని టిడిపి నాయకుల్లో విభేదాలు వీడతాయన్న నమ్మకం కార్యకర్తల్లో ఉండేది. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితుల గురించి ఇరువురు నాయకులకు గట్టిగా చెబుతారని అందరూ ఆశించినా ఆ దిశగా చర్యలు చేపట్టకుండానే చంద్రబాబు రోడ్ షో ముందుకు సాగింది. అనంతరం చంద్రబాబును లోకేష్‌ను నియోజకవర్గంలో నాయకులు వేర్వేరుగా కలిసి అనైక్యతను మరోసారి బయటపెట్టారు.



'ఇదేం.. ఖర్మ'లో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

వేర్వేరుగా కార్యక్రమాలు...

'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం టిడిపి అధిష్టానం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఆదోని నియోజకవర్గంలో మాత్రం నాయకులు వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. ఈనెల 2న దిబ్బనకల్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరుసటి రోజు మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మదిరే భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, సౌదీ రావుఫ్, బసాపురం రామస్వామి, మాజీ కౌన్సిలర్ రామచంద్ర ఆధ్వర్యంలో బసాపురంలో కార్యక్రమం నిర్వహించారు. అప్పటి నుంచి పోటాపోటీగానే ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నారు. మీనాక్షి నాయుడు వెంట కార్యకర్తలు సింహభాగం ఉన్నప్పటికీ ద్వితీయ శ్రేణి నేతలంతా వేరే కుంపటి పెట్టడం వల్ల పార్టీకి నష్టం లేకపోలేదని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. నాయకులు సమిష్టిగా పార్టీ అభివృద్ధికి పాటుపడితే వచ్చే ఎన్నికల్లో ఫలితం ఉండే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇలా వేరు కుంపటి పేరుతో తూతూ మంత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తే అసలుకే మోసం లేకపోలేదని పలువురు చెబుతున్నారు. ఆదోనిలో వర్గ విభేదాలు ముదిరినా ఏమీ పట్టని విధంగా జిల్లా, రాష్ట్ర కమిటీలు చోద్యం చూడడం తగదంటూ కార్యకర్తలు నిరుత్సాహం చెందుతున్నారు.



వేరుగా కార్యక్రమం నిర్వహిస్తున్న గుడిసె కృష్ణమ్మ, భాస్కర్ రెడ్డి గ్రూపు

ఎఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చిప్పగిరి



చిప్పగిరి మండల వ్యవసాయ శాఖ అధికారిగా సోమవారం ఆనంద్ లోకదళ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డిప్యూటేషన్‌పై చిత్తూరు జిల్లా నుంచి చిప్పగిరికి బదిలీపై వచ్చామని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. రబీలో పంటలు సాగు చేసిన ప్రతి రైతు కూడా రైతు భరోసా కేంద్రాల అధికారులను సంప్రదించి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే ఏ సహాయమైనా ఈకేవైసీ చేయించుకున్న రైతులకే లబ్ధి చేకూరుతుందని తెలిపారు. రైతులు ఎవరూ అజాగ్రత్తగా ఉండకుండా ఈకేవైసీ యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు కోరారు.

'మధ్యాహ్నం' కార్మికులకు కనీస వేతనమివ్వాలి

- ఎంఇఒ కార్యాలయం ముందు సిఐటియు ధర్నా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.15 వేలివ్వాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి రాముడు కోరారు. సోమవారం ఎంఇఒ కార్యాలయం ముందు వంట కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉండి అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హామీఇచ్చారని తెలిపారు. మూడున్నర ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజన పథకంలో కార్మికులకు సరైన వేతనం ఇవ్వడం లేదన్నారు. కూరగాయలు, వంట పదార్థాల ధరలు పెరిగాయని తెలిపారు. జగనన్న గోరుముద్ద మెనూ చార్జీలు ప్రతి విద్యార్థికీ 20 రూపాయలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్స్యూరెన్స్, యూనిఫారం, గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు పి.రాజు, వంట కార్మికులు పద్మ, కవిత, వరలక్ష్మి, ముంతాజ్ బేగం, లలిత, లక్ష్మి పాల్గొన్నారు.

బీసీల అణచివేతే లక్ష్యంగా జగన్ పాలన

- టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మిన్నెప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో బీసీల అణచివేతే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మిన్నెప్ప మండిపడ్డారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు తహశీల్దార్ జయన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మిన్నెప్ప, బీసీ సెల్ కమిటీ సభ్యులు దయాసాగర్, పార్లపల్లి మల్లికార్జున, రంగస్వామి గౌడ్, రామకృష్ణ, మల్లికార్జునలు మాట్లాడారు. బీసీ సంక్షేమాన్ని మంటగలిపి బడ్జెట్ కేటాయింపుల్లో అంకెల గారడీలతో వైసిపి ప్రభుత్వం ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మల్లికార్జున, దేవేంద్ర, సలాం, రంగన్న, శంకర్ గౌడ్, సుధాకర్, కృష్ణ పాల్గొన్నారు. **మంత్రాలయం** తహశీల్దార్ చంద్రశేఖర్‌కు టిడిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యక్షులు చౌటుపల్లి వీరేశ్, కార్యదర్శి పైబావి నర్సిరెడ్డి, నవకోటి నారాయణ, చిన్న స్వామి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.



తహశీల్దారు జయన్నకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

పాఠశాలకు మంచి రోజులు

- దౌల్తాపురం సర్పంచి లక్ష్మీదేవమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకం ద్వారా మారుమూల గ్రామాల పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని దౌల్తాపురం సర్పంచి లక్ష్మీ దేవమ్మ తెలిపారు. సోమవారం సర్పంచి లక్ష్మిదేవమ్మ, వైసిపి నాయకులు షేకన్న మాట్లాడారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ సహకారంతో మారుమూల గ్రామమైన దౌల్తాపురం పాఠశాల అభివృద్ధి పనులకు నాడు-నేడు రెండో విడత కింద రూ.12.50 లక్షలు, ప్రహరీకి రూ.2.39 లక్షలు మంజూరు చేశారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, ఉపాధ్యాయులు సీతారాముడు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు 42 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. పాఠశాల అభివృద్ధి పనులపై విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వివరించారు.



నాడు-నేడు పథకానికి ఎంపికయిన దౌల్తాపురం పాఠశాల

ప్యాచ్ రోడ్డు వద్దు.. పూర్తి రోడ్డు కావాలి

- సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం నుంచి ఉరుకుంద గ్రామం వరకు ప్యాచ్ రోడ్డు వద్దని, పూర్తిగా రోడ్డు వేయాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఉరుకుందలో ఆర్చి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.1.10 కోట్లతో గతంలో నాసిరకంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పుణ్యక్షేత్రాలైన శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి, శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి, శ్రీరాఘవేంద్ర స్వామి దేవాలయాలకు భక్తులు రాకపోకలు నిర్వహిస్తుంటారని చెప్పారు. రోడ్డు వేసిన మూడు నెలలకే 1200 గుంతలు పడ్డాయని తెలిపారు. ఇలాంటి రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఎమ్మెల్యే ఆదేశించినా కాంట్రాక్టర్ బేఖాతరు చేశారని తెలిపారు. ప్రస్తుతం ప్యాచ్ వర్క్ పనులు చేపట్టి చేతులు దులుపుకోవడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని విమర్శించారు. పనులు కాకుండా రోడ్డును పూర్తిగా వేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మండల కన్వీనర్ ఈరన్న, ఉల్లిగయ్య, వెంకటేష్, వీరేష్, వలీ పాల్గొన్నారు.

పేదలను దోచుకోవడమే వైసిపి పని

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

చెత్త, ఇంటి పన్ను పేరుతో పేదలను దోచుకోవడమే పనిగా వైసిపి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని, వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆదోని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు హెచ్చరించారు. సోమవారం పట్టణంలో మరాఠిగేరి 32వ వార్డులో తెలుగు యువత పట్టణ అధ్యక్షులు, వార్డు ఇన్‌ఛార్జీ రవి ఆధ్వర్యంలో 'ఇదేం.. ఖర్మ మన రాష్ట్రానికి' చేపట్టారు. టిడిపి నాయకులు, క్లస్టర్ యూనిట్ సభ్యులు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ మరోవైపు ప్రజలను చైతన్యపరచడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశమని తెలిపారు. వైసిపి పాలనతో ప్రజలు విసిగి పోయారని, చంద్రబాబును కోరుకుంటున్నారని చెప్పారు. నాయకులు బుద్ధారెడ్డి, లక్ష్మీనారాయణ, జయరాం, సుబ్బు ఉన్నారు. **19వ వార్డు** మండగిరి ఆర్‌టిసి కాలనీ, దివాకర్ నగర్‌లో వార్డు ఇన్‌ఛార్జీ వడ్ల శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో చేపట్టారు. ఆయన మాట్లాడారు. నిత్యావసర వస్తువులు, సిమెంట్, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు, విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నులు, బస్సు చార్జీలు పెరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. టిడిపి వార్డు నాయకులు లక్ష్మీనారాయణ, డిష్ రవి, డిష్ ఈరన్న, రామదాసు, సురేంద్ర పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని మేలిగనూర్, నదీచాగి, కుంభాలనూర్, ఉరుకుంద, కుంటనహాళ్ గ్రామాల్లో 'ఇదేమి.. ఖర్మ'ను వేర్వేరుగా మూడు క్లస్టర్లలో నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జీ, టిడిపి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ కొట్రేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు చెన్నప్ప, ఇన్‌ఛార్జీ వెంకటపతి రాజులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, రామలింగ, సిద్ధప్ప, గోపాల్ నాయక్, కురుగోడు, రాజానందు పాల్గొన్నారు.



కౌతాళంలో మాట్లాడుతున్న నాయకులు

రబీ సీజన్ పూర్తయ్యే వరకు నీరివ్వాలి

- అఖిలపక్షాల డిమాండ్

- మార్చి వరకు సాగునీరివ్వాలని తహశీల్దార్ కార్యాలయం దిగ్బంధం

ప్రజాశక్తి- దేవనకొండ

హంద్రీనీవా నుంచి మార్చి వరకు సాగునీరు ఇస్తామని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని అఖిలపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయాన్ని 4 గంటలపాటు దిగ్బంధించారు. సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి, సిపిఎం జిల్లా నాయకులు బీ.వీరశేఖర్, టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, జనసేన నాయకులు మగ్బుల్ బాష, కాంగ్రెస్ నాయకులు గొర్రెల శ్రీనివాసులు, లోక్‌సత్తా నాయకులు రాందాస్ గౌడ్ మాట్లాడారు. ప్రభుత్వ పెద్దల మాటలు నమ్మి రబీ సీజన్‌లో మండలంలోని వందలాది ఎకరాల్లో వేరుశనగ, ఇతర పంటలు సాగు చేశారని తెలిపారు. తీరా డిసెంబర్ చివరి వరకే నీరిస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం మార్చి చివరి వరకు నీరివ్వకుంటే రైతులకు ఆత్మహత్యలు శరణ్యమని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రైతుల పట్ల చిత్తశుద్ధి లేని ప్రభుత్వం బాధ్యత రహితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతులు ఆందోళన చెందుతుంటే మంత్రి గుమ్మనూరు జయరాం స్పందించకపోవడం బాధాకరమన్నారు. రబీ సీజన్ పూర్తయ్యే వరకు నీరిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా నుంచి నీరిస్తామని చెప్పేంత వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. వివిధ పార్టీల నాయకులు నెట్టేకల్, యూసుఫ్, నాగరాజు, రాజగోపాల్, చాంద్, బండ్లయ్య, శ్రీరాములు, బజారి, రామాంజి, అశ్వత్థామ, కోమేష్, రాము, రాజశేఖర్, బడేసాబ్, సూరి, అశోక్, బాషా పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయ దిగ్బంధంలో మాట్లాడుతున్న వీరశేఖర్



ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- ఎంపిడిఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని గణేకల్లు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు వీరారెడ్డి, రామాంజనేయులు కోరారు. సోమవారం ఎంపిడిఒ గీతావాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో అనేకసార్లు సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రాలు, గ్రామ సభలు, సచివాలయం ముట్టడి సందర్భంగా సమస్యను పరిష్కరిస్తామని హామీఇచ్చారని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో సమస్య పరిష్కారం కావడం లేదని విమర్శించారు. ఈ నెలలో గ్రామాల దేవరను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. బి.చిన్న వీరేష్, శాంత కుమార్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ప్రజాశక్తి - ఆస్పరి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జగనన్న కాలనీ వాసులకు విద్యుత్, నీటి సౌకర్యం, రోడ్లు, డ్రెయినేజీలు తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు బేస్ మట్టానికి కూడా సరిపోదని, రూ.5 లక్షలు ఇవ్వాలని తెలిపారు. అనంతరం తహశీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. సిపిఐ నాయకులు అంజినయ్య, కృష్ణ మూర్తి, ఉరుకుందప్ప, రమేష్ పాల్గొన్నారు. **దేవనకొండలో** సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.నెట్టేకల్ ఆధ్వర్యంలో జగనన్న కాలనీలను సందర్శించారు. కాలనీల్లో జరుగుతున్న పనులను, సమస్యలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి, మండల కార్యదర్శి ఎం.నరసరావు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లు...గుంతలమయం

- పట్టించుకోని పాలకులు, అధికారులు

- ఇబ్బందుల్లో ప్రయాణికులు, గ్రామీణ ప్రాంత ప్రజలు

ప్రజాశక్తి - హొళగుంద



గుంతలమయమై వర్షపు నీరు నిలిచిన మార్లమడికి రోడ్డు (ఫైల్)

హొళగుంద మండలంలో గ్రామీణ రోడ్లన్నీ గుంతలమయం కావడంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. హొళగుంద నుంచి ఆలూరుకు, ఆదోని నుంచి హొళగుందకు చేరుకోవాలన్నా, కర్ణాటక సరిహద్దు గ్రామం మార్లమడికి రోడ్డు కర్ణాటక సరిహద్దులోకి అడుగు పెట్టడానికి 5 కిలోమీటర్లు మాత్రమే ఉంది. ఈ రోడ్లన్నీ గుంతలమయం కావడంతో ఎక్కడికి వెళ్లాలన్నా సమయం వృథా అవుతోంది. నానా ఇబ్బందులు పడి గమ్యస్థానానికి చేరుకొని 'హమ్మయ్య' అంటూ ప్రయాణికులు బయటపడుతున్నారు. మార్లమడికి రోడ్డు భూమిపూజకే పరిమితమైంది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల తర్వాత మార్లమడికి రోడ్డుకు నిధులు కేటాయించామని, రూ.2.60 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సంబంధిత శాఖ అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. ఇంతవరకూ నిర్మాణ పనులకు నోచుకోవడం లేదు. "మంత్రిగారు' శంకుస్థాపన చేశారు. ఇక మన రోడ్డు పనులు పూర్తయినట్లే' అని మండల ప్రజలు భావించారు. భూమి పూజ చేసి రెండేళ్లయినా పనులు మొదలు పెట్టలేదు. 'ఇక మా బతుకులు ఇంతే' అని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హొళగుంద మండలానికి చేరుకోవాలంటే ఏ రోడ్డులో చూసినా గుంతలు ఉన్నాయి. గర్భిణులు, పాము కాటుకు గురైన వారు, దీర్ఘకాలిక రోగులు బళ్లారి, కర్నూలు వంటి జిల్లా కేంద్రాలకు వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగేష్

అభ్యర్థుల వయో పరిమితిని పెంచాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

ప్రజాశక్తి - ఆదోని

ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయో పరిమితిని, పరీక్ష గడువును పెంచాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, పట్టణ కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఎట్టకేలకు 6,100 కానిస్టేబుల్, 400 ఎస్ఐ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. గత నాలుగేళ్ల నుంచి ఎస్ఐ, కానిస్టేబుల్ నోటిఫికేషన్ రాకపోవడంతో లక్షలాది మంది యువత వయస్సు పైబడి అనర్హులుగా మారారని తెలిపారు. వారిని దృష్టిలో ఉంచుకుని వయో పరిమితిని ఐదేళ్లు పెంచాలని, అధిక సిలబస్ ఉన్నందున పరీక్ష గడువును ఒక నెల వాయిదా వేయాలని కోరారు. డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు నాగరాజు, నాయకులు మోహన్, వెంకటేష్, జమీర్, నవీన్, వీరేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఉపాధి హామీ పనులను సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్ సోమవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వలసల నివారణకు ఉపాధి సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉప సర్పంచి సులోచనమ్మ భర్త బెల్ ఈరన్న, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, వైసిపి నాయుకులు వాల్మీకి రాఘవేంద్ర, మొగతాల్ నాగన్న, టెక్నికల్ అసిస్టెంట్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ వాల్మీకి మధు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- టిడిపి నాయకులు కృష్ణమ్మ

- సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు వాల్మీకుల ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాట మార్చారని టిడిపి నాయకులు గుడిసె కృష్ణమ్మ విమర్శించారు. ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ సోమవారం ఆలూరు నుంచి పాదయాత్రగా 'హలో వాల్మీకి... చలో ఆదోని సబ్ కలెక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు అర్జున్ మాట్లాడారు. వాల్మీకుల చిరకాల వాంఛ ఎస్టీ రిజర్వేషన్‌ను నెరవేర్చడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. పత్తికొండ కాంగ్రెస్ నాయకులు క్రాంతి నాయుడు, అడ్వకేట్ వీరన్న నాయుడు, సిపిఐ నాయకులు రాజు, వాల్మీకి నాయకులు సాయి ప్రసాద్, ఆరెకల్ రామకృష్ణ, ఆలూరు సురేష్, రాఘవేంద్ర నాయుడు, ఆర్‌సిసి సెక్రటరీ రాజు, ఎల్లార్తి మాజీ సర్పంచి సునీత, టిడిపి నాయకులు కల్లుబాయి మల్లికార్జున, కపటి మహాదేవ, సోము విరుపాక్షి, వెంకటేష్, తాయన్న, వాల్మీకులు ఉన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

సామాజిక తనిఖీలో రూ.1,09,859 రికవరీకి ఆదేశాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

సామాజిక తనిఖీలో బయట పడిన రూ.1,09,859 రికవరీకి డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో ఎంపిడిఒ ప్రభావతి అధ్యక్షతన బహిరంగ సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం కింద 2021-22 ఆర్థిక సంవత్సరంలో 1169 పనులకు రూ.12.50 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 1169 పనుల్లో గ్రామీణ ఉపాధి పనులతో పాటు పంచాయతీ రాజ్, సర్వశిక్ష అభియాన్ పనులు జరిగాయని చెప్పారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా జరిగిన పనుల్లో మాధవరం గ్రామంలో రూ.22,864, మంచాలలో రూ.64,479, రాంపురంలో రూ.16,623, ఉపాధి పనుల్లో మాధవరం గ్రామంలో రూ.611, మంచాలలో రూ.940, రాంపురంలో రూ.635, చిలుకలడోనలో రూ.1,169, మాలపల్లిలో రూ.1,212, సుంకేశ్వరిలో రూ.375, వి.తిమ్మాపురంలో రూ.951ల ఖర్చులకు సరైన ఆధారాలు లేకపోవడంతో మొత్తం రూ.1,09,859 రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. డ్వామా ఎఒ నాగేశ్వరరావు, డ్వామా డివిఒ సిద్ధలింగమూర్తి, ఎమ్మిగనూరు ఏపీడీ అల్లిపీరా, క్వాలిటీ కంట్రోల్ అధికారి సాయికిషోర్, ఎస్ఆర్‌పి శ్రీమూర్తి, పిఆర్ ఎఇ నరసింహులు, ఎపిఒ తిమ్మారెడ్డి, ఇసి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్ : ఉపాధి కూలీలకు పనులు పెంచాలని, ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా కూలీల హాజరు పంపాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఎమ్మిగనూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతి గ్రామంలో ప్రజలకు పని కల్పించి ఉత్తమమైన ఫలితాలను సాధించాలని తెలిపారు. గ్రామాల్లో వలసలను అరికట్టేందుకు ఉపాధి పనులు కల్పించి భరోసా కల్పించాలని చెప్పారు. డ్వామా ఎఒ నాగేశ్వర రావు, డివిఒ సిద్ధా లింగమూర్తి, ఏపీడీ అల్లిపీరా, సిఎల్‌ఆర్‌సి బనవాసి సుజాత, ఎపిఒ విజయ్ మోహన్, కంప్యూటర్ ఆపరేటర్ నరసప్ప, పాల్గొన్నారు.





స్పందన ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించి శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో స్వీకరించిన విజ్ఞప్తులను క్షేత్ర స్థాయిలో పరిష్కరించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఫిర్యాదులను గడువులోగా నాణ్యతతో పరిష్కరించడంతోపాటు క్షేత్రస్థాయి ఫోటోలను స్పందన పోర్టల్లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ ఎల్ ఏలోకి వెళ్లకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తుకు ప్రాపర్ ఎండార్స్మెంట్ ఇవ్వడంతో పాటు స్పీకింగ్ ఆర్డర్స్ ఇవ్వాలన్నారు. అర్జీలు ఎట్టిపరిస్థితిలో రీఓపన్ కాకూడదన్నారు. మొక్కుబడి రీతిలో క్లోజ్ చేయకుండా అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో ఖచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. పెండింగులో వున్న 65 రీఓపెన్ కేసులు, వితిన్ ఎస్ ఎల్ ఏలో వున్న 1170 సర్వీసులు, 24 గంటల్లో పరిష్కరించాల్సిన 4 సర్వీసులు, 48 గంటల్లో పరిష్కరించాల్సిన 12 అర్జీలు, టాప్ 10 సర్వీసులకు సంబంధించి బియాండ్ ఎస్ఎల్ఏలో వున్న 152 దరఖాస్తులన్నింటినీ త్వరితగతిన క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల్లో కోర్టుకు సంబంధించిన కంటెంప్ట్ కేసులకు కౌంటర్ ఫైల్ చేయడంతో పాటు మధ్యంతర, తుది ఉత్తర్వులను వెంటనే అమలు పరచాలని సంబంధిత ఆర్డీవోలు, తాసిల్దార్లను, అన్ని శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వార్తాపత్రికల్లో ప్రతిరోజు వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి ఏ రోజుకారోజు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ లతో పాటు రీజాన్డర్లు పంపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాయలసీమ గర్జనకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జెఎసి నేతలు

శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేయాలి

- కర్నూలులో హైకోర్టు కోసం దేనికైనా సిద్ధం
- రాయలసీమ గర్జనలో మంత్రులు, వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కర్నూలు క్రైం

శ్రీబాగ్ ఒప్పందాన్ని అమలు చేమాలని, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని మంత్రులు, పలువురు వక్తలు డిమాండ్ చేశారు. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలని కోరుతూ కర్నూలు ఎస్టిబిసి కళాశాల మైదానంలో కర్నూలు మేయర్ బివై.రామయ్య అధ్యక్షతన సోమవారం రాయలసీమ గర్జనను నిర్వహించారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాషా మాట్లాడుతూ 1937 నుంచి మరుగున పడిన శ్రీబాగ్ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చి అన్ని ప్రాంతాలకూ న్యాయం చేయాలని జగన్ ముందుకు వెళ్తుంటే టిడిపి నాయకులు ఒకే రాజధాని అంటున్నారని తెలిపారు. ఉద్యమం ఆరంభమైందని, జెఎసికి వైసిపిగా మద్దతునిస్తున్నామని, న్యాయరాజధాని సాధించుకు నేందుకు కృషి చేస్తామని తెలిపారు. టిడిపి నాయకులు ఇళ్ల వద్దకు వస్తే మహిళలు చీపురు, పురుషులు చెప్పులు పట్టుకుని తరమికొట్టాలన్నారు. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు పెట్టడాన్ని టిడిపి నాయకులు ఎందుకు అడ్డుకుంటున్నారన్నారు. చంద్రబాబుకు కర్నూలులో హైకోర్టు పెట్టడం ఇష్టం ఉందా? లేదా? అని ప్రశ్నించారు. అన్ని ప్రాంతాలకు న్యాయం చేయాలనే వికేంద్రీకరణ సిద్ధాంతాన్ని తీసుకొచ్చారన్నారు. చంద్రబాబును రాయలసీమ దోషిగా పరిగణించాల న్నారు. చంద్రబాబు, టిడిపికి రియల్ ఎస్టేట్ బృందం మీద తప్ప ఎవరి మీదా ప్రేమ లేదన్నారు. అందరి అభిప్రాయాల మేరకే కర్నూలులో హైకోర్టు పెట్టాలని సిఎం అనుకున్నారని, 10 కిలోమీటర్ల మేర కనపడేలా హైకోర్టు కట్టబోతున్నామని తెలిపారు. చంద్రబాబు రాయలసీమలో పుట్టింటే హైకోర్టు ఏర్పాటుకు మద్దతిస్తారన్నారు. కర్నూలు పేరుతో వేల కోట్లు సంపాదిస్తున్న చిత్రపరిశ్రమకు చెందినవారు కర్నూలులో హైకోర్టును డిమాండ్ చేయాలన్నారు. శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎంపిలు సంజీవ్ కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ రాజధాని అడిగే హక్కు రాయలసీమకే ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా రాజధాని ఒక చోట, హైకోర్టు మరో చోట ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కోరుముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ హక్కులు సాధించుకునే వరకూ పోరాటం సాగించాలని, బలిదానానికి కూడా సిద్ధంగా ఉండాలని అన్నారు. పోరాడితే హక్కులు కాపాడుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఆరంభ సూరత్వం కాకుండా ఏమైనా చేయడానికి కూడా సిద్ధంగా ఉండాలని చెప్పారు. జెఎసి ఛైర్మన్ విజయ్ కుమార్ రెడ్డి, విద్యార్థి జెఎసి అధ్యక్షులు సునీల్ రెడ్డి, ఛైర్మన్ శ్రీరాములు, ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వెంగళరెడ్డి, హైకోర్టు న్యాయవాది పల్లి ప్రభాకర్ రెడ్డి, న్యాయవాది నాగలక్ష్మి, రవీంద్ర విద్యా సంస్థల అధినేత పుల్లయ్య, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు ఓంకార్, రవిగువేర, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు జయచంద్రారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఆర్ కృష్ణ, మైపర్ విద్యా సంస్థల అధినేత ఆదిమూలపు సతీష్, జెఎసి రీజినల్ కోఆర్డినేటర్ ఆకెపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ప్రయివేటు కళాశాలల జెఎసి నాయకులు లింగేశ్వరరెడ్డి మాట్లాడారు.



రాయలసీమ గర్జనకు హాజరైన ప్రజలు

మంత్రులు మాట్లాడక ముందే వెనుదిరిగారు

రాయలసీమ గర్జన సభకు ప్రయివేటు కళాశాలల విద్యార్థులను పెద్ద ఎత్తున తరలించారు. ఎండ మండిపోవడంతో విద్యార్థులు చాలా సేపు కూర్చోలేకపోయారు. ఇంకెంత సేపు అంటూ విసిగిపోయారు. మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడటం ప్రారంభించిన వెంటనే విద్యార్థినులు లేచి వెళ్లిపోయారు. దీంతో ముందు భాగంలోనే కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కొంద మంది విద్యార్థులను మళ్లీ వెనక్కి పంపి కూర్చోబెట్టగా వారు కూడా కాసేపటి తరువాత మెల్లగా జారుకున్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు...సామాన్యులకు ఇబ్బందులు

రాయలసీమ గర్జన నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్రీరామ థియేటర్, మౌర్యా ఇన్, రాజ్ విహార్, ఐదు రోడ్ల కూడలి ప్రాంతాలవైపు ఎటువంటి వాహనాలనూ పోలీసులు అనుమతించలేదు. అత్యవసరంగా వెళ్లాల్సిన వారి పట్ల కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. మౌర్యా ఇన్ కూడలి వద్ద ఓ ద్విచక్రవాహనదారుడు ఆస్పత్రికి వెళ్లాలని విన్నవించినా ట్రాఫిక్ ఎస్సై కరుణించకుండా లేదు..తిరిగి వెళ్లండి అంటూ సమాధానం ఇచ్చారు. బ్యాంకుకు వెళ్లాలని చెప్పిన ఓ బ్యాంకు ఉద్యోగికి వాహనం ఎక్కడో ఒక చోట పెట్టుకుని పోవయ్యా అంటూ ఉచిత సలహా ఇచ్చారు.

గుడిసె వాసులకు పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు

బిఆర్ఆర్ నగర్ గుడిసె వాసులకు పట్టాలివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నాడు సిపిఎం మండల నాయకులు పి ఫకీర్ సాహెబ్, పి వెంకటేశ్వర్లు, బేస్తరాజు ,వీ.ఆంజనేయులు, గోపాలకృష్ణ ,రామిరెడ్డి తదితరులు కలిసి తహశీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో కర్నూల్ రోడ్డులో ఉన్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్ కాలనీలో సర్వేనెంబర్ 589 ,590 ,595 లో దాదాపు 15 సంవత్సరాలు నుండి 150 మంది ఎస్సీ, ఎస్టి ,బీసీ, మైనార్టీ తదితర కులాలకు చెందిన నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉన్నారని వారికి పట్టాలివ్వాలని కోరారు. సిపిఎం ఆందోళన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం వారు విద్యుత్తు స్తంభాలు వేసి, కరెంటు మీటర్లు ఇచ్చారన్నారు. నివాసం ఉన్న పేదలకు పట్టాలు ఇవ్వాలని మున్సిపాలిటీ వారిని కోరగా మున్సిపాలిటీ కౌన్సిలర్ల సమావేశంలో చైర్మన్ సుధాకర్ రెడ్డి తీర్మానం చేసి రెవిన్యూ అధికారులకు పంపడం జరిగిందని కావున వెంటనే నివాసం ఉన్న పేదలకు పట్టాలిచ్చి పక్కా గృహాల నిర్మించి ఇవ్వాలని వారు కోరారు. అనంతరం తహశీల్దార్ రాజశేఖర్ స్పందిస్తూ ఆర్ఐ సత్యనారాయణను పిలిపించి విచారణ చేయమని చెప్పి ఆదేశించారు. పేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



ఎమ్మార్వో వినతిపత్రం ఇచ్చిన సిపిఎం నాయకులు

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని ఆలవకుండా క్రాస్ రోడ్డు వద్ద కాశిరెడ్డి నాయన ఆరాధోత్సవ సందర్భంగా ఆరవ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి ఎద్దుల పందెములు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పోచయ్య వెంకటరామిరెడ్డి సోమవారం తెలిపారు. కావున ప్రజలందరూ ఆరాధోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'మధ్యాహ్న భోజన' కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూర్

మధ్యాహ్నం భోజనం పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయు జిల్లా నాయకులు రణధీర్, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్ లు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం దగ్గర ధర్నా చేసి ఎంఈఓ జానకిరామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ.20 లకు పెంచాలన్నారు. నూతన మేనూలో హాట్ పొంగలి, సాంబార్ బాత్, ఆకు కూర, అన్నం తొలగించాలన్నారు. గ్యాస్ ప్రభుత్వ మే సరఫరా చేయాలని, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని, బడ్జెట్ పెంచాలన్నారు. పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలకు పథకాన్ని అప్పగించరాదన్నారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ప్రాంతాలలో వాటిని రద్దుచేసి వర్కర్ల తోనే పథకం కొనసాగించాలని, కార్మికులకు 10 నెలలకే వేతనాలు ఇస్తున్నారు, 12 నెలలకు వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుల స్వాములు, మధ్యాహ్న భోజన కార్మికులు శంషాద్ బేగం, అహ్మద్ బి, ప్రభావతి, ఖాజాబీ, రమీజాబీ, హుస్సేన్ బి, ముబారక్, నూర్జహా, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఇఒ ఆఫీస్ ముందు సిఐటియు టౌన్ అధ్యక్షురాలు ఆర్ జయరాణి అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కే భాస్కర్ రెడ్డి, సిఐటియు టౌన్ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంఇఒకు అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు దానమ్మ, రోశమ్మ,హుస్సేన్ బి మరియమ్మ, సుబ్బమ్మ,తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు :** మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈఓ ఆఫీస్ నందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు పి.లింగస్వామి అధ్యక్షతన, సిఐటియు మండల కార్యదర్శి జి నాగమణి, సహాయ కార్యదర్శి, బి వెంకట శివుడు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రతి నెల 5 వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ,20/బి లకు పెంచాలని, నూతన మేనూలో హాట్ పొంగలి, సాంబార్ బాత్, ఆకు కూర అన్నం తొలగించాలని, గ్యాస్ ప్రభుత్వ మే సరఫరా చేయాలని, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని, బడ్జెట్ పెంచాలని, పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని అన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం మండల అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, యూనియన్ నాయకులు, రమణమ్మ, చంద్రకళ, మద్దమ్మా, మధ్యాహ్న భోజన కార్మికులు, సంజకర్ణమ్మ, టీ నాగలక్ష్మమ్మ, నసీమ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒకి వినతి పత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు



వినతి పత్రం ఇస్తున్న నాయకులు



ప్రజల నుండి నూతన స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కే. రఘువీర్ రెడ్డి

ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు

- జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందనలో వచ్చిన సమస్యలు తిరిగి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ కే రఘువీర్ రెడ్డి అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో ఎక్కువగా సివిల్ తగాదాలు, ఎక్కువగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆర్ . రమణ గారు నంద్యాల టౌన్ డీఎస్పీ సి .మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్స్ నియామకాలు రద్దు : డిఇఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

విద్యాంజలి 2.0, ఏపిఎల్ హెల్త్ కేర్, ఎంఎం సంక్షేమ సంఘం లేదా మరేదైనా పేరుతో పాఠశాల కార్యకలాపాలకు డిజిటల్ అసిస్టెంట్స్ ఏపీ హెల్త్ కేర్ , హైదరాబాద్ నుండి నియామకాలు చేసుకోమని ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలో ఉన్న జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏపిఎల్ హెల్త్ కేర్, ఎంఎం సంక్షేమ సంఘం లేదా మరేదైనా పేరుతో వారి అభ్యర్థులను డిజిటల్ అసిస్టెంట్స్‌గా ఎవర్నీ నియమించుకోవద్దని తెలిపారు. ఒకవేళ నియమకాము చేసుకొనిన తీవ్రమైన చర్యలు తీసుకొనబడునని డిఇఒ జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను హెచ్చరించారు. ఉన్నతాధికారులు ఎటువంటి బాధ్యత వహించరని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

భూములను సాగు చేసుకోనివ్వండి

- కలెక్టర్‌ను కలిసిన గిరిజనులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వం తమకు ఇచ్చిన భూములను ఫారెస్ట్ అధికారులు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని మహానంది మండలానికి చెందిన చెంచుగూడెం గిరిజనులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు వేశారు. సోమవారం గిరిజనులు స్పందనలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు.మాపై దయవుంచి తమ సమస్యను పరిష్కారించాలని' గిరిజనులు కలెక్టర్‌ను కోరారు.

రాజకీయ పబ్బం కోసమే సీమ గర్జన

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - చాగలమర్రి

రాజకీయ ఉనికి కోసమే వైసిపి నాయకులు సీమ గర్జన పేరుతో సెల్ఫ్ డబ్బాను కొట్టుకున్నారే తప్పా సీమ ప్రయోజనాల కోసం కాదని మాజీ మంత్రి,టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమా అఖిలప్రియ విమర్శించారు. 14వ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాజీ మంత్రి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపితోనే సీమకు అన్యాయం జరిగిందన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా మైనార్టిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్సర్ బాషా, టిడిపి మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు. **టిడిపి లో చేరిక:** పట్టణంలోని కోటగడ్డ కాలనీకి చెందిన వైసిపి కార్యకర్త లు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో టిడిపి లో చేరారు. క్రిష్ణంపల్లె ఇమాంసాబ్, మదార్‌వలి, మౌళాలి, ఇమాంహుసేన్, ఖైరూన్, రహంతున్,మాబుచాన్,మాబుసున్ని,రహంతున్‌భీ,అత్తారున్ లతో మరి కొందరు మాజీ మంత్రి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. **బేతంచెర్ల :** రాయలసీమ ద్రోహి ముఖ్యమంత్రి జగన్ అని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన రాష్ట్రానికి ఇదేం కర్మ అనే కార్యక్రమంలో భాగంగా బేతంచెర్ల మండల పరిధిలోని రహిమాన్ పురం గ్రామపంచాయతీలో మండల కన్వీనర్ ల నాగయ్య ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబ్బారెడ్డి, ఎల్ల నాగయ్య మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలనకు ప్రజలు విసుగు చెందారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ డోన్ నియోజకవర్గం గౌరవ సలహాదారులు కాకర్ల తిరుమలేశ్ చౌదరి, ముస్లిం మైనార్టీ టిడిపి రాష్ట్ర నాయకులు జాకీర్ హుస్సేన్, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు రవీంద్ర నాయక్, మండల నాయకులు జవ్వాజి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** పట్టణంలోని ఏబీమ్ పాలెంలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఇదేమి కర్మ రాష్ట్రానికి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాజధాని రాజకీయాలు, నిలకడలేని పాలన, సామాన్య ప్రజలకు మోయలేని భారంగా ఇదేమి కర్మ రాష్ట్రానికి, పట్టిన పీడ అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల మోహన్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొల్లెద్దుల రాజన్న, 22వ వార్డు ఇన్చార్జి కళాకారు, నిమ్మకాయల రాజు, విజయుడు, సురేష్, ప్రవీణ్ రగడ, సుంకన్న, శేఖర్, కళ్యాణ్, నాగేంద్ర, నాగరాజు తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** వైసీపీ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో బీసీల అభివృద్ధి పురోభివృద్ధి శూన్యమని తెలుగుదేశం పార్టీ డోన్ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ఎర్రమల నాయుడు అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు మండల నాయకుడు బుగ్గానా పల్లి రమేష్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రమల, రమేష్‌లు మాట్లాడారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం తమ సొంత పనులకు కార్యక్రమాలకు మళ్లించి బీసీలకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. అనంతరం తహసిల్దార్ నరేంద్రనాథ్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. టిడిపి బీసీ సెల్ నాయకులు రమేష్ రామ్మూర్తి, టైలర్ రాముడు, చంద్రశేఖర్, శ్రీధర్, కొలువలపల్లి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



ఇదేమి కర్మ కార్యక్రమలో పాల్గొన్న మాజీ మంత్రి అఖిల ప్రియ, టిడిపి నేతలు

సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్య లను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు రాంబాబు, ఆదిలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ సెంటర్ నందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు రాంబాబు, ఆది మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయడం లేదని ఒక్కొక్క విద్యార్థికి రెండు పూటలా భోజనం తినడానికి కేవలం 42 రూపాయలు చెల్లించడం దారుణమని అన్నారు. అలాగే డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు 46 రూపాయలు ఈ ప్రభుత్వం కేటాయిస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. జైల్లో ఖైదీల కంటే దారుణంగా విద్యార్థులను ఈ రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని అన్నారు. సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు వెంటనే సన్న బియ్యం సరఫరా చేయాలని లేని పక్షంలో సీఎం ఆఫీస్ కూడా ముట్టడి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు డివిజన్ అధ్యక్ష,కార్యదర్శిలు సిసింద్రీ,శివ శంకర్, సహాయ కార్యదర్శి సతీష్, నాయకులు మనోజ్, కిరణ్, చెన్నయ, ప్రసాద్,విద్యార్థులు పాల్గొన్నారు. **సీనియర్ డోన్ :** రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న సంక్షేమ హాస్టల్ సమస్యలను పరిష్కరించా లని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పిడిఎస్‌యు డోన్ డివిజన్ కార్యదర్శి కె పవన్ సోమవారం ఆర్‌డిఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. పీడీఎస్ యు సహాయ కార్యదర్శి రాఘవేంద్ర, నాయకులు మోహన్ ప్రసాద్, రాజశేఖర్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పిడిఎస్‌యు నాయకులు

ఉనికి కోసమే సీమ గర్జన

- డిసిసి అధ్యక్షులు జె. లక్ష్మి నరసింహ యాదవ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



రాయలసీమలో తన రాజకీయ లబ్ధికోసమే వైసిపి రాయలసీమ గర్జన నిర్వహించి ప్రాంతాల మధ్య వైషమ్యాలు సృష్టిస్తుందని డిసిసి అధ్యక్షులు జె. లక్ష్మి నరసింహ యాదవ్ ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2014లో ఈ సీమ గర్జన పెట్టి ఉంటే ఆనాడే రాజధాని వచ్చిండేదని ఓట్లు సీట్ల కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోస్తా ప్రాంతం వాళ్లకు తలొగ్గాడన్నారు. రాయలసీమలో కర్నూల్ లో హైకోర్టు ఏర్పాటు చేయడానికి స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన వెంటనే మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి హడావిడి చూస్తుంటే కర్నూలులో శంకుస్థాపన చేస్తారేమో న్యాయ రాజధాని కోసమని ప్రజలు అనుకున్నారని, తీరా తన రాజకీయ లబ్ధి కోసం రాయలసీమ గర్జన పేరుతో కర్నూల్‌లో వైసీపీ ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం సిగ్గుచేటు అన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లోని మార్పులను సవరించాలి

: సిఐటియు

ఇ-ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఐసిడిఎస్ ప్రాజెక్టు మార్పులు చేర్పులను సవరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్‌ను కోరారు. సోమవారం స్పందనలో యూనియన్ నాయకులు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. నాగరాజు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. నిర్మలమ్మ, జిల్లా నాయకురాలు నాగరాణి, సునీత, నీలిమలు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ దర్భంగా వారు మాట్లాడుతూ విడిపోయిన జిల్లాల ఆధారంగా ఐసిడిఎస్ ప్రాజెక్టులను మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆయా ప్రాజెక్టులలో అంగన్వాడీల అభిప్రాయాలు కూడా పరిగణంలోకి తీసుకొని మార్పులు చేర్పులు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



వినతి పత్రం ఇస్తున్న సిపిఐ నేతలు

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు తక్షణమే అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాడు సిపిఐ ఆధ్వర్యంలో నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెలాఖరు లోపు టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పజెప్పకపోతే లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేయిస్తాం అని హెచ్చరించారు. సిపిఐ నంద్యాల పట్టణ కార్యదర్శి ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారాయుడు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న, ఏఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు భూమని శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శివయ్య, వాసు, టిడ్కో గృహాల లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్యాలరీ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం దేవస్థానానికి పశ్చిమ వీధి, శివవీధిలో గ్యాలరీ నిర్మించేందుకు సోమవారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న భూమి పూజ నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి అనంతరం భూమి పూజ నిర్వహించారు. ఇఒ లవన్న మాట్లాడుతూ సకాలంలో ఈ గ్యాలరీ నిర్మాణం పూర్తి చేయాలని విభాగాన్ని ఆదేశించారు. ఈ గ్యాలరీ నిర్మాణం పూర్తయితే ఉత్సవాల సమయంలో భక్తులు వేచి ఉండేందుకు స్వామీ అమ్మవాళ్ళు దర్శించుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. భక్తులు సేదతీరు ఎందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. వీరితోపాటు దేవస్థానం ధర్మకర్తల మండల సభ్యులు, దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కౌన్సిలర్ విజయ్ చౌదరి పుట్టినరోజు

- 108 వాహనానికి ఆక్సిజన్ సిలిండర్ విరాళం

ప్రజాశక్తి - ఆత్మకూర్



ఆక్సిజన్ సిలిండర్‌ను బహూకరిస్తున్న విజయ చౌదరి

ఆత్మకూరు మున్సిపాలిటీ 16వార్డు కౌన్సిలర్ విజయ్ చౌదరి తన పుట్టినరోజు సందర్భంగా 108 వాహనానికి ఆక్సిజన్ సిలిండర్‌ను సోమవారం బహుకరించారు. విజయ్ చౌదరి తండ్రి పాండురంగ చౌదరి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా రైతులకు అనేక సేవా కార్యక్రమాలు చేశారని, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదాన్ని అభివృద్ధి చేశారని, పాండు రంగ చౌదరి మరణించిన తర్వాత ఆశయాలకు అనుగుణంగా తనయుడు విజయ్ చౌదరి కూడా క్రీడాకారుల అభివృద్ధికి ఎంతో శ్రమిస్తున్నారని పలువురు అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సుల్తాన్, మారు బోతుల విజయ్, వైఎస్ఆర్సిపి నాయకులు నాగరాజు, ఎంఎస్ రషీద్, వెంకట స్వామి గౌడ్, టి హరి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - నందికొట్కూర్

మండలంలోని అల్లూరు గ్రామంలో ట్రాక్టర్, ఆటోలో అక్రమంగా తరలిస్తున్నటువంటి 80 బస్తాల (40 క్వింటాల్) రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ తాసిల్దార్ వెంకటనారాయణ, విజిలెన్స్ ఎస్ఐ హనుమంతు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు డిప్యూటీ తాసిల్దార్ పద్మావతి, వీఆర్వో జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి : ఎస్‌టియు

ప్రజాశక్తి - ప్యాపిలి



మాట్లాడుతున్న ఎస్‌టియు నాయకులు

విద్యారంగ,ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికై ఈనెల ఏడవ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నాను విజయవంతం చేయాలని నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్యాపిలి మండల ఎస్.టి.యు ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగుల డిఏ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. మలి విడత రాష్ట్రస్థాయి ధర్నా కార్యక్రమాన్ని విజయవాడలో ఈనెల 20వ తేదీన నిర్వహించాలని రాష్ట్ర సంఘం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు చంద్రమౌళి, చిన్నపరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు టీ.వీ రమేష్, సుభాష్, మండల సహా అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

- నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చాగలమర్రి



తీవ్రంగా గాయపడ్డ షేక్షావళి

మండలంలోని నగళ్ళపాడు గ్రామ సమీపంలోని 40వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు చాగలమర్రికి చెందిన షేక్షావళి,తన బార్య అనిషాభీతో ద్విచక్ర వాహనంపై నంద్యాలకు వెలుతూ పెట్రోలు కోసమై నగళ్ళపాడు సమీపంలో పెట్రోలు బంకు వద్దకు వెలుతుండగా రుద్రవరం మండలం టి.లింగందిన్నెకు చెందిన నాగప్రసాద్,నరసింహుడు, బాషలు ద్విచక్ర వాహనం పై చాగలమర్రి కి వస్తుండగా భవనాసి వంతెన సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.గాయపడ్డి షేక్షావళి, అనీషాభీల ను టోల్‌ప్లాజా అంబులెన్స్ లో చాగలమర్రి కేరళ వైద్యశాలకు,నాగప్రసాద్,నరసింహుడులను 108లో ఆళ్ళగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

భూమిని సంరక్షించుకుందాం

ప్రజాశక్తి - రుద్రవరం

భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎఫ్ఎంసీ కంపెనీ జోనల్ మార్కెటింగ్ మేనేజర్ కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం మండలములోని ఎర్రగుడి దిన్నె గ్రామంలో వరల్డ్ సాయిల్ డే సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి అల్లిపిర ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడా రు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రాజు, తదితరుపాల్గొన్నారు.



గర్జనకు తరలి వెల్తున్న నాయకులు



ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రాయలసీమ సింహ గర్జనకు బయలుదేరి వెళుతున్న వైసిపి నాయకులు

రాయలసీమ గర్జనకు భారీగా నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో కర్నూలులో జరిగే రాయలసీమ గర్జనకు వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున ర్యాలీ గా బయలుదేరి వెళ్లారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డ్ నుండి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో రాయలసీమ సింహ గర్జనకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి, మండల కన్వీనర్ గుండం నాగేశ్వర రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి డాక్టర్ విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ మహ్మద్ హుస్సేన్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ సాదుల శివశంకర్ రెడ్డి, నాయకులు అబ్దుల్ ఫైజ్, జిల్లెల్ల శంకర్ రెడ్డి, కుమ్మరి సురేష్ బాబు ,ఎర్రగుడి రామసుబ్బారెడ్డి , పాత పాడు వెంకటేశ్వర రెడ్డి, నారాయణ, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** కర్నూలు జిల్లా కేంద్రమైన కర్నూల్‌లో సోమవారం జరిగిన రాయలసీమ గర్జనకు శ్రీశైలం నియోజకవర్గం నుండి భారీ ఎత్తున వైసిపి కార్యకర్తలు వాహనాల్లో తరలి వెళ్లారు. ఆత్మకూర్ మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్, కౌన్సిలర్లు విజయ్ చౌదరి, మారుబోతుల విజయ్, సుల్తాన్, పాణ్యం పార్వతి, బోయ పార్వతి, రంగస్వామి, ప్రకాష్, రాజగోపాల్, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు పువ్వాడి భాస్కర్, జడ్పిటిసి సభ్యుడు శంకర్ రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి, వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో తరలి వెళ్లడం జరిగి ంది. **పగిడ్యాల :** రాయలసీమ గర్జనకు పగిడ్యాల గ్రామం వైసిపి నాయకులు తరలి వెళ్లారు. ఉమ్మడి జిల్లా ఖోఖో అసిసోయషన్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, సర్పంచు పెరుమాళ్ళ శేషన్న ఆధ్వర్యంలో గర్జనకు తరలి వెల్లారు. **ఉయ్యాలవాడ :** రాయలసీమ గర్జనకు ప్రజలను భారీగా తరలించామని హరివరం గ్రామ సొసైటీ చైర్మన్ పల్లె మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు. కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, పోచ రాధాకృష్ణారెడ్డి, పోచ వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడలో..గర్జనకు తరలి వెళ్తున్న వైసిపి నాయకులు

గుడ్ షెఫర్డ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- పిడిఎస్‌యు, ఏఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లా కేంద్రంలోని గుడ్ షెఫర్డ్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థి వశీకర్ స్కూల్ మిద్దెపై నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన పై విచారణ జరిపించి, పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎండి. రఫీ, ఏ.ఐ.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్ డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం.డి రఫీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్ మాట్లాడుతూ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన అంశంపై సమగ్ర విచారణ చేపట్టి జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. పిడిఎస్‌యూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దస్తగిరి, గిరి, నవీన్, ఏఐఎస్ ఎఫ్ నంద్యాల పట్టణ ఆర్గనైజింగ్ కార్యదర్శి మనోహర్,ఉపాధ్యక్షుడు లోకేష్,ఏఐఎస్ఎఫ్ నాయకులు రవితేజ,హాజిస్ పాల్గొన్నారు.

రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి హేయమైన చర్య : టిడిపి

ప్రజాశక్తి - చాగలమర్రి

చిత్తూరు జిల్లా పుంగనూరులో యువ నాయకుడు భేరి రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి చేయడం, హేయమైన చర్య అని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నంద్యాల జిల్లా ఇంచార్జి, ఆళ్లగడ్డ తాలూకా యాదవ సంఘం అధ్యక్షులు సల్ల నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక శివాలయం కాలనీలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రామచంద్ర యాదవ్ 3 కార్లు, 10 ద్విచక్ర వాహనాలు, ఇంట్లో ఫర్నిచర్ ధ్వంసం చేయడం ఇటువంటి అరాచకాలు బీసీలపై దాడి సమంజసం కాదని పాల్పడిన వారిని ప్రభుత్వం పోలీసులు వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. బీసీలు రాజకీయంగా ఎదుగుతుంటే ఓర్వలేకే ఈ దాడులు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ గౌడ్, దూదేకుల మహబూబ్ బాషా, పొడవుల బాల దస్తగిరి, బట్టల రమణ, దూదేకుల సుబ్బరాయుడు, బ్రహ్మయ్య చారి, మహబూబ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.**ఆళ్లగడ్డ:** రామచంద్ర యాదవ్ ఇంటిపై వైకాపా కార్యకర్తలు దాడి చేయడం, అమానస చర్య అని బీసీ సంఘం నాయకులు బంగారు రాము యాదవ్, బీసీ సాధికారత కన్వీనర్ నల్లగట్ల గురప్ప యాదవ్ అన్నారు. సోమవారం శ్రీరామ కళ్యాణ మండపంలో బిసి, యాదవ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు నల్లగట్ల గుర్రప్ప యాదవ్, పసల లక్ష్మయ్య యాదవ్, కంచర్ల కృష్ణయ్య, మాజీ కౌన్సిలర్ నరసింహుడు, మల్లికార్జున యాదవ్, బండారు శ్రీరాములు, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల:** రామచంద్ర యాదవ్ ఇంటిపై వైకాపా కార్యకర్తలు దాడి చేయడం అమానస చర్య అని యాదవ్ సంఘం నాయకులు గొర్రెల పెంపకదారుల సంఘం జిల్లా డైరెక్టర్ బి జయరాముడు యాదవ్, పుల్లయ్య యాదవ్, రంగన్న యాదవ్ అన్నారు. దాడులకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.



.మాట్లాడుతున్న సల్ల నాగరాజు, తదితరులు

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు



మాట్లాడుతున్న జిల్లా సిఐటియు అధ్యక్షులు వి.యేసు రత్నం

కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాలను సవరణ చేసి నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసురత్నం డిమాండ్ చేశారు. సోమవారం నాడు సిఐటియు జిల్లా మహాసభల కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం మండల సున్నిపెంట సిఐటియు కార్యాలయం నందు సిఐటియు మండల నాయకులు ఎం. చిన్న మారెన్న అధ్యక్షతన నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.యేసురత్నం మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లతో కోట్లాదిమంది కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి వాగ్దానము చేసిన బిజెపి, అందలము ఎక్కిన తర్వాత ఉద్యోగము ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను తీసివేస్తున్నారని అన్నారు. అవినీతిని అంతం చేస్తానని అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి ప్రభుత్వము అవినీతికి మారుపేరుగా మారిందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అమ్ముతూ ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందన్నారు. పెరుగుతున్న ధరలను తగ్గించడంలో విఫలమైందని, ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రత్యేక హోదా ఇవ్వకపోగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముతూ రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ, కార్మికుల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బలమైన ఉద్యమాలు చేపట్టాలని వివరించారు. అనంతరము సిఐటియు నూతన మండల కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. సిఐటియు మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం. చిన్న మారన్న ఉపాధ్యక్షులుగా ఆనందు, మరియమ్మ,సహాయ కార్యదర్శి మల్లికార్జున, మధుసూదన్ రావు మరో 15 మందితో కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది . **నంద్యాల :** ఈ నెల 27 ,28 తేదీలలో నంద్యాల పట్టణంలో సిఐటియు నంద్యాల జిల్లా రెండో మహాసభలను నిర్వహించడం జరుగుతుందని ఈ మహాసభల ను విజయవంతం చేయడం కోసం కార్మికులంతా ఐక్యంగా ముందుకు రావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు,

జిల్లా మహా సభలను జయప్రదం చేయండి : సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు

సిఐటియు పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అర్బన్ జనరల్ బాడీ సమావేశంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు నాగరాణి, కార్యదర్శి సునీత లతోపాటు అంగన్వాడి కార్యకర్తలు 105 మంది పాల్గొనడం జరిగింది. సమావేశంలో ఏ నాగరాజు, లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు కార్మికుల జీవితాలతో చెలగా టం ఆడుతున్నాయని అన్నారు. కేంద్రం అంగన్వాడి కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం అనేక యాప్‌ల పేరుతో కార్మిక, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. మహాసభల్లో చర్చించి కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి



ప్రజాశక్తి - పాములపాడు

రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందాలని వ్యవసాయ విస్తరణ అధికారి మద్దిలేటి సూచించారు. సోమవారం పాములపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి మద్దిలేటి మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అంట ఉత్పత్తులను తీసుకోవడమే పొలంబడి ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. కలబండి ప్రతాప్ అను రైతు మినుము పంట క్షేత్రంలో రక్షక పంటగా జొన్న, ఎర్ర పంటగా ఆముదము, అలసంద వేయించారు. పంటలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మద్దిలేటి, వివిఏ గాయత్రి, ఎంపీఈవో మున్నా మినుము రైతులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : రైతులు శనగ సాగుపై అవగాహన పెంచుకోవాలని నంద్యాల ఆర్ఎస్ శాస్త్రవేత్త వెంకటరమణ తెలిపారు. సోమవారం మండలంలోని ఉయ్యాలవాడ మాయలూరు తుడుమల దీన్నే తదితర గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలకు అనువైన సెనగరకాలను రైతులు సాగు చేసుకోవాలన్నారు. వేరు కుళ్ళు తెగుళ్ల నివారణకు ట్రైకోడెర్మి ద్రావణాన్ని లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల ఏ డి ఏ నిరంజన్, మండల వ్యవసాయ అధికారి రాజేంద్ర, రైతులు పాల్గొన్నారు.



తెగుళ్ళ నివారణ పై రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు



మహాసభలను జయప్రదం చేయండి : వ్యకాసం

ప్రజాశక్తి - పాములపాడు

ఈనెల 8, 9.,10 తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శెట్టి బాలయ్య, మండల అధ్యక్షులు ఎస్ఆర్ రమణ, రైతు సంఘం మండల కార్యదర్శి టి వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం నాడు రాష్ట్ర మహాసభల గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యచరణాలు మహాసభలో ప్రకటించడం జరుగుతుందన్నారు.

బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల



నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రభుత్వము బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను చేపట్టకుండా తాత్కాలిక ప్రాతిపదికన సర్దుబా టు ప్రక్రియను చేపట్టిందని,అధి కారులు వెంటనే ఈ సర్దు బాటు ప్రక్రియను ఆపాలని యుటిఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.వి.ప్రసాదు, జే.సుధాకర్ లు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారుల కార్యాలయాల ముందు సర్దు బాటు ప్రక్రియను వ్యతి రేకిస్తు నిరసన చేపట్టాలని ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం నంద్యాల జిల్లా డీఈఓ కార్యాలయం ముందు మెరుపు నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రమోషన్ల ప్రక్రియ నిర్వహించి వారికి స్థానాలు కేటాయించకుండా జాప్యం చేసుందన్నారు.

చిన్న వెంకట రెడ్డి మృతి పట్ల బిసి ఇందిరా సంతాపం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని మదనంతపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కంచాని మల్లేశ్వరరెడ్డి గారి తండ్రి కంచాని చిన్న వెంకట రెడ్డి (87) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి గారి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి మదనంతపురం చేరుకుని మృతదేహంపై పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జయలక్ష్మి రెడ్డి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేత అబ్దుల్ సత్తార్ మృతి

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రిలోని 16వ వార్డుకు చెందిన టిడిపి నాయకులు అబ్దుల్ సత్తార్(58) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. అబ్దుల్ సత్తార్ మరణం వార్త తెలుసుకున్న నియోజకవర్గ టిడిపి నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి చాగలమర్రి చేరుకుని అబ్దుల్ సత్తార్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏ సమస్య వచ్చినా తనున్నానని అధైర్యపడవద్దని కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్అన్సర్ బాష, కొలిమి హుస్సేన్ వల్లి, కొల్లిమీ మాబు షరీఫ్ , అబ్దుల్లా ముళ్ళ ఆలంసా గారి మౌలాలి, హనీఫ్, ముల్లా గఫార్ ఖజా రసూల్ కొలిమి సున్ని హుస్సేన్, సోను ఆకుల ఇర్షాద్, కింగ్ హుస్సేన్, హారున్, షబ్బీర్ సంతాపం తెలిపారు.

విఆర్ఏ చీకటి ఈశ్వరయ్య మృతి

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ముత్తలూరు గ్రామానికి చెందిన వీఆర్ఏ చీకటి ఈశ్వరయ్య (63) అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం తాసిల్దార్ వెంకట శివ మృతదేమానికి పూలమాలతో నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ అంత్యక్రియల నిమిత్తం రెవెన్యూ శాఖ తరపున రూ 15000, వీఆర్ఏల సంఘం తరపున రూ 5000,అంత్యక్రియల నిమిత్తం అందజేయడం జరిగిందన్నారు. నివాళులు అర్పించిన వారిలో ఆర్ఐ నాగేంద్రుడు, వీఆర్వో ఫక్రుద్దీన్, వీఆర్ఏల సంఘం నాయకుడు పీర్ బై, సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ప్యాపిలి

మండల పరిధిలోని బావిపల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కం ఓనర్ ధనుంజయ (44) అనారోగ్యంతో కర్నూలులో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతికి డోన్ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.శివరాం సంతాపం వ్యక్తం చేశారు.ఆదివారం ఉదయం మృతుని స్వగ్రామం బావిపల్లి లో ధనుంజయ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంత్యక్రియల్లో చింతలపేట డ్రైవర్ సురేష్, బావిపల్లి,మాధవరం గ్రామాలకు చెందిన లారీ ఓనర్లు,డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఎపిఎస్ఎస్‌డిసి, ఎస్ఇఇడిఎపిల ఆధ్వర్యంలో ఈ నెల 9న ఆళ్లగడ్డ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఎపిఎం రామశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటిఐ, తదితర ఉన్నత మైన కోర్సులు చేసినవారు అర్హులన్నారు. ఐసిఐసిఐ బ్యాంక్, అపోలో ఫార్మసీ, అమర్ రాజా బ్యాటరీస్, సుజాత పైప్స్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ తదితర కంపెనీలలో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా తో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం జరిగిందని సిఎస్ఐ పాస్టర్ సుధాకర్ బాబు తెలిపారు. నంద్యాల మండలంలోని మిట్నాల గ్రామంలో క్రిస్మస్ సంబరాల్లో భాగంగా సోమవారం సిఎస్ఐ చర్చిలో క్యాండిలైట్ సర్వీస్ దీపారాధన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని సిఎస్ఐ చర్చి సంఘ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల డయాసిస్ యూత్ డైరెక్టర్ పాస్టర్ చైర్మన్ సుధాకర్ బాబు పాల్గొని దైవ సందేశం అందించారు.

నాడు- నేడు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ప్యాపిలి

మండలంలోని గార్లదిన్నె గ్రామంలో హరిజనవాడ ఎంపీపీ ఎస్ స్కూల్ నందు నాడు నేడు పనులకు సర్పంచ్ సీమ మనోహరమ్మ, కర్నూల్ కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్,సింగిల్ విండోస్ చైర్మన్ సీమ సుధాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ నాడు స్కూలు అధ్వానంగా ఉండేవని నేడు కార్పొరేటర్ స్కూళ్లకు దీటుగా ఉన్నాయని తెలిపారు. వార్డ్ మెంబర్లు, స్కూల్ కమిటీ చైర్మన్, హెడ్మాస్టర్ పాల్గొన్నారు.

వెంకటసుబ్బయ్య గౌడ్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పలుకూరు గ్రామంలో జే కే ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద చారి ఆధ్వర్యంలో గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ అభివద్ధికి కషి చేస్తున్న కేఈ వెంకటసుబ్బయ్య గౌడ్ ను ఘనంగా సన్మానించారు సోమవారం పలుకూరు గ్రామంలో చిలకలూరిపేటకు చెందిన జయ జయ సాయి ట్రస్ట్ అధ్యక్షుడు పూసపాటి బాలాజీ సహకారంతో భక్తి భావనపై కృషి చేస్తున్న కేఈ వెంకటసుబ్బయ్య గౌడ్ సన్మానం చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద చారి మాట్లాడారు. కార్యక్రమంలో శీను,రాముడు,రామాలయ భక్త బృందం పాల్గొన్నారు.

జిల్లాలో 3150 టిబి కేసులు

ప్రజాశక్తి - చాగలమర్రి

జిల్లాలో 3150 టిబి కేసులు ఉన్నాయని జిల్లా క్షయ నివారణ అధికారి మల్లికార్జున రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఆయన ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాగలమర్రి మండలంలో 18 క్షయ కేసులు ఉన్నాయన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారికి ఆరు నెలల పాటు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. కుష్టువ్యాధి సర్వేలో 40 అనుమానిత కేసులు వచ్చాయని వాటిలో రెండు కేసులు వ్యాధి లక్షణాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ సూపర్వైజర్లు రామలింగారెడ్డి, రామచంద్రుడు, సీతారాములు, సిబ్బంది మనోహర్,శేఖర్,తదితరులు పాల్గొన్నారు.